ప్రజాకోర్టు

విప్లవకారులు నిర్వహించే ప్రజాకోర్టుల గురించి కొందరు రచయితలు విన్నవో, ఊహించినవో రాస్తున్నారు. శ్రీకాకుళ రైతాంగ పోరాటం నాడైనా, చివరికి ఇప్పుడైనా విప్లవోద్యమం నిర్వహించిన, నిర్వహిస్తున్న ప్రజాకోర్టుల గురించి 'కథలు' కాదు కథనం చదవండి.

1.

ఎ. అప్పలనాయుడు

వారం రోజుల క్రిందట గెంజిబట్టి, యిస్త్రీ చేయబడ్డ ఖాకీచొక్కా, ఖాకీ నిక్కరు....జెండా కొయ్యలా సన్నగా పొడుగ్గావున్న జగన్నాధరావు ఒంటిమీద ఎద్దుకి ఏనుగుతోలు తొడిగినట్లు ఒదులొదులుగా వున్నాయి. ఎండకి సెవటతేలి తడిసి....అక్కడక్కడా తెల్లగా ఉప్పుదేలి గబ్బుకంపుగొడుతున్నాయి. నెత్తిమీది ఎర్రటోపీ కప్పిన జుత్తులోంచి చెమటలూరి మెహమ్మీదికి కారుతోంటే....జగన్నాధరావు మొహం తడిసిన పెద్దనక్క మొహంలా వుంది. గోర్జిలోంచి సైకిలు తొక్కుకుంటూ....అక్కడక్కడా వీలుగానిచోట సైకిలు దిగి వడుస్తూ....జగన్నాధరావు ఆ మురదెండలో, సుమారు ఉదయం పదకొండు గంటలవేళ....'కాకితాడ' వెల్తున్నాడు.

గోర్జిత్రోవ అక్కడ మలుపు తిరిగింది, మలువు తిరిగేదాక.... ఎదురొచ్చేదేదీ కన్పించనంత దట్టంగా గోర్జికిరువైపులూ....డొంకటా! గోర్జి తోమట్టి వకువుల గిట్టలకీ, నాటుబిళ్ళకీ నలిగి, ధూళయి, తుప్పా, డొంకలునిండింది. తుప్పల ఆకులు స్వతహాగా వుండాల్సిన పచ్చదనంగాక, గోధుమరంగు ధూళిపడి ..మేకప్ చేయబడ్డట్లున్నాయి. ఎండతో గాలి....యీ ధూళిని మోసుకొస్తూ....దుమ్మువాసనేస్తోంది.

మలుపు తిరిగిన జవానుకి....ఎదురై పోయాడు ఆరిక పగడాలు! ఎదురై పోయిన పగడాలు చేతిలో రెండు ఎర్ర పుంజులు.... పెద్దొరస పుంజులు రెక్కలాడిస్తూ కన్పించాయి.

పగడాలు, పగడాలు చేతిలో ఎర్ర పుంజులు ఒక్కసారిగా అదిరిపడ్డాయి.... సైకిల్ మీది జవాన్నిచూసి....ప్రాణం మీదికొచ్చిన పెద్దనక్కను చూసినట్లు!! పుంజులు రెక్కలుగొట్టుకున్నాయి, పగడాలు గుండెలు గొట్టుకున్నాయి.

జవాను సైకిల్‌గంట కొట్టాడు! సైకిలాపాడు! పగడాల్ని ఆపి "యేట్రారె కొండోడా! మంచి పెద్దొరన పుంజుల్లాగున్నాయేవిర, యేవిరా" అని చేతులు చాపాడు కోడిపుంజుల కోసము!

పోలీసోడి పాలబడితే మరి తబ్బులురావు అని బెంగపడిన పగడాలు గునుస్తూ "నాది కావు బావ్....మొన్నపల్లం (కురుపాం) నుంచి మా నేస్తఁవొచ్చి డబ్బులిచ్చి కొనుక్కొండు, యీ పొద్దుతెమ్మంతే....వొట్టుకెల్తన్నాను" అన్నాడు.

"పల్లపోడే నేస్తమేటిరా ? పోలీసోడు కాడేటి ? అదికాదు, సూత్తానియ్యిరనీ సరి కిట్రలగ సుట్టుకుంతావియ్యేస్" అని లాక్కొని కోడి పుంజులు రెండింటినీ రెక్కలెత్తి బరువు ఆనికజూసుకొని, గుద్దమట్ట....గారకాయ తడిమి, బాగున్నాయని సంతృప్తిచెంది: "కష్టమొట్టనేపోదు" అని అనుకొని "యీ ఎండల సెవప్లెక్కి సైకిల్ తొక్కినందుకు....ఫలితం దక్కింది" అని భావించి: "సొండోడి సారా.... కోడికూరా" తోటిమజానిగూడ తల్చుకొని....రెండు ఎర్రపుంజుల్ని ఎగరేయదనిచాడు ఎర్రజిందవలాగ జగన్నాధరావు జవాను. పుంజులు రెండింటినీ, సైకిల్ హేండిల్‌కి తాడుతోటి కట్టేసాడు. సైకిల్ స్టాండు దించి....పయనమవసాగాడు....! కాకితాడకి!

"బాబ్బాబు! జవానుబావో! వొదిలీవా, నావిగావాపుంజులు! పల్లం మానేస్త మొల్లకోడు. పుంజులొట్టికెల్లకపోతే....మల్లి ఆల మొకం సూడలేను" పగడాలు.

"నేస్తం మొకం సూడకపోతే నష్టమేటిలేదు. కొండనమీకే, నాకోకవమొత్తే... మరినువ్వు నీ పెళ్ళంమొకం సూడద్ జాగర్త. పోనిగదాని, పుంజులుతోటి వది లెత్తన్ను. "దొరికినావుర, నక్సలైటు నాకొడకా" అని లాకప్పులెట్టి....ఎముక లిరిసీగల్ను" అని లాటీ పగడాలు మొహమ్మీదకి ఊపి, అదిరించి "అంచేరెల్లు ఎర్రా ....అమాయకపోడి లాగున్నావు...ఏ ఊరేట్రా ?" అనడిగాడు. "కాకితాడ బావ్.."

"మరింకేమి నీనూ అక్కడికీ వొత్తన్న....సొండోడున్నాడురా ?" అనడిగాడు.

"ఉన్నాడు బావ్....నాకోళ్లిచ్చీవా!" సైకిల్ ఎదురుగెల్లి బ్రతిమాలుతూ అడిగాడు.

సైకిల్‌ని ముందుకి తోసి గుద్దించుతూ "ఏఁదిరింకొాదలవు, తిన్నగ [illegible]ట్ట.. ఏముడేనకాల దమయంతి నాగొచ్చా వంతే....మెళ్ల జీవ్వాలు ఖిగి పోగలవు....

జేగర్త" అది మరోసారి సైకిల్ తోటి పగడాలుని తోస్సి: హేండిల్‌కి కట్టిన కోళ్ళని చేత్తో తడిమి• భద్రమే అని నిర్ణయించు కొని, ఈల వేసుకుంటూ... సైకిలెక్కి 'కాకితాడ' తోవబట్టాడు పోలీసు !

తన దారిద్ర్యాన్నీ, జవాను దౌర్జన్యాన్ని కలిపి తిట్టుకుంటూ. నేస్తం యేటంతాడో అని బెదురుతూ...పల్లిం వెల్లలేక...పగడాలు ఖుంటివైపే తిరుగుముఖం పట్టాడు,

తిన్నగా..'కాకితాడ' ఊరిమొగానున్న సొందోడి యింటి యిందు సైకిలాపి. సైకిల్ దిగి, స్టేండు వేసాడు జవాను జగన్నాధరావు.

మందలోకి తిన్నగొచ్చేసిన 'ఎర్రజెందవ'ని చూసిన మేకల్లా చెల్లా చెదుర య్యారు. అప్పవరకూ సొందోడి అరుగుల మీద కూర్చున్న కొంతమంది గిరిజన్లు.

కదల్లేక దొరికి పోయిన చూలున్న మేక పీక పట్టుకున్న యెర్రజెందవలాగ... సొండోడింట్లోని యిప్ప సారా గూన పట్టుకున్నాడు జవాను.

సొండోడు యింట్లోలేడు. సొండోడి పెళ్ళాం కొంతమ్ముంది. కాంతమ్మకిదేమీ కొత్తగాదు. గనుక గాభరా పడలేదు.. భయపడనూలేదు. గూన ప్రక్కనే వున్న గ్లాసొకటి తీసి, యిప్పసారా గూనలో ముంచి ఆ గ్లాసు జవాను కందించింది.

"సొట్ట గ్లాసు సారాతోటి సరిపెట్టేద్దమను కుంతన్నావేటే..సొండిదానా ? నీ నెందుకొచ్చా నేటో తెలుసా ?" అని గదుముతూ గ్లాసందుకున్నాడు,

"పోలేరమ్మ తల్లికీ..పోలీసోడికీ అడ్డేటి ? నువ్వడి గిందెప్పుడు కాదన్నాము" అని చనువుగానే జవాబిచ్చింది కొంతమ్మ.

కొంతమ్మ చనువు..యెందుకో జగన్నాధరావుని చిరాకు పర్చింది. ఆ చిరాకు తోనే "యిరిడీ ముక్కకి సేవ బట్టేసినట్టుగ..నీ ఒంటికి షోత్తరం బట్టేసిందే..నీకు.." అనింకేదో అనబోగా..సొండోడొచ్చాడు.

"దండాలు..జగన్నాధరావు జవాను గోరో..దండాలు అని చేతులెత్త కుండా నోటితో నమస్కరించి: భార్యతో "జవాను గోరికి కుర్చీయేసి..కూకోమనలేక పోనావా?" అనడిగాడు.

మూలనున్న కుర్చీ ధూళి దులిపి తీసుకొచ్చివేస్తూ"బిచ్చినకొంచి గయ్యి.. గయ్‌మని కేకలేసి తెయ్యితెయ్యిమని గెంతులేత్తండీ గానేటి వాల్లందా..నిలత్తండా ?

834

నీను కూకోండి బావో..అని కుర్చీ యెయ్యడంకి ?" అనిజవాన్ని చెప్పుతూ జవా బిచ్చింది కాంతమ్మ.

కాంతమ్మ మాటల్లో చెప్పి పొదుపుని కప్పిసుకుంటూ "సర్లేగానీ, అదిగా సైకిల్ హేండిల్‌కి యెర్రపుంజులు రొండుంతాయి..అటికి తెచ్చి..నూక వెయ్యమే అందాకల..తిరగెల్లినప్పుడు ఒట్టికెల్తానని" పురమాయించాడు.

కాంతమ్మ కోళ్లు తెచ్చి "ఘనమయిన పుంజులు..యెక్కడ కొన్నావో గానీ బాగున్నాయి.."అంది.

"జగన్నాధరావు జవాను.. జేబుడబ్బు లెట్టిపిండొడాలు కొన్డు..పుంజులు కొంతాడా"సొండోడు.

"నోర్మూయ్‌ర.. సొండినా కొడకా ! కాలం మారిపోనాదిరా ! ఒట్టిపున్నెంకి 'ఒస' ముక్క దొరకవీ రోజుల్ల నేపోతే..నెల మామూళ్ళకి సొండోడింటికి రావల్సి వొత్తాదే ?" అని తిరిగి దెబ్బ గొట్టాడు జవాను :

"జాను గానీ..కష్టవెడితే..కాకితోటి పంపీనా ! నువ్వే రావాలా ? రాక, రాక తిన్నగ పులి బండలోకి ఎలిపోవొచ్చినావు.." సొండోడు.

"ఓరేట్రో ! యేటి సొండోడా ; పులి బండంతన్నావు.. నీ యింటి కొత్తే ! గీర గుండేటిరా ?" పోలీసు గసిరాడు.

"అదిగాదు బావ్ ! యిదిగీ వొలసలన్నీ సంగమయి పోనాయి. యీ యేరియా ఓలుమొత్తంల సంగమే ప్రెబుత్వం. సత్తెం మేస్టుర్‌గోరూ.. సంగపోల్లా యేటిజెప్తే అదే వేదం ! నీకు తెలన్దేటి? దగ్గిట, దగ్గిట మూడొందలొలనల్ల సంగానిదే రాజ్జెం ! బుగతలు భూ(వులొదులుకోని, సావుకార్లు అప్పూ, సప్పు లొదులుకొని పట్నాలంట పట్టేసినారు. కర్నం, నాయుడ్లు కలాలు మూస్సినారు. పారిస్టోల్లు..అడివిని మర్సి పోంద్రు; పని కాడనుండి పంటదాక, తిండి కాడ్నుండి..తగువులూ తంటాలు దాక.. అన్నిటికాడ.. అ సంగమోళ్లే ! యిప్పుడిక్కడ నీ గవిర్మెంటూ లేదు...నీ పోలీస్తనమూ సెల్లదు.. యిదిగిదీ చంగతి" అది సొండోడు అప్పటి పరిస్థితిని క్లుప్తంగా వివరించాడు.

సొండోడి మాటల్తో జగన్నాధరావులో భయం కల్గింది. సంగం గురించీ, సత్తెం మేస్టారు గురించీ విన్నాడు. గానీ తమ స్టేషన్‌కి కనుచూపు దూరానున్న

'కాకితాడ' ల గూడా సంగమోల్ల బలం వుంటాదనుకోలేదు. అయినా యిపుడు తొందర పడాల! "వొచ్చింది ఒకందుకైనా.. సొండోడి వార్తవల్ల మరొకలాభం..ఈడ్ని స్టేషన్‌కి ఒట్టికెల్లి.. వయానా భయానా అడిగితే..సంగపోల్ల స్థావరాలా, సత్యం మాష్టారి అను పానులూ చెప్తాడు. ఈడ్ని తోడు తీసుకొని..ఫోర్సు మొత్తం బయలెల్తే..సత్యం మేస్టార్ని పట్టీవొచ్చు.. ఆ రకంగా ప్రమోషనూ, ప్రభుత్వం ప్రకటించిన బహుమా నమూ కొట్టీవొచ్చు..అప్పులు తీర్చీవొచ్చు..హాయిగ బతకొచ్చు" అని ప్లానులేసి, కలలుగన్న పోలీసు, గభాలున కుర్చీలోంచి లేచి, టోపీ తలకు తగిలించి, లాఠీ చంకలో పెట్టి..కాంతమ్మ నుండి కోడిపుంజుల్ని అందుకొనీ సైకిల్ వద్దకెల్లి, పుంజుల్ని హేండిల్‌కి కడుతూ "జానారే సొండోడా! నీకు సైకిలున్నాది గదరా! అలాగ టేసన్ దాక తోడు రమ్మిరా..!" అని పిల్చాడు.

"ఓలమ్మో! పోలీసోడితోటెల్తే యింకేటున్నాదా.. సంగపోలికెవులికేనా దనులయితే మా పనయి పోద్ది.. వొద్దు నాయినో.." కాంతమ్మ.

"ఓసేటీ నీ గోస! గవుర్మెంటోడి మాటినకపోతే...గంగల కలిసిపోద్దే నీ యాపారం! అన్నాడు జవాను.

"యేపారం యేటిల కలిత్తే కల్నీ గానీ బతుకులు బుగ్గయిపోతాయి నాయినో.. సంగపోలికి యే పెమాదమో తలపెట్టమని మాటిచ్చి, ఆలకనుమానం రాకుండా బతుకొత్తన్నాము.. నే పోతే మీమూ పట్నాలు బట్టీవలసింది. పట్నమెల్తే పాసి గియ్యడంకి పనికిరాము...యిదిగీ యాపారంల...విన్నా...విన్నా...బెంచాము తప్పా యేటి మిగిలేను కోలేదు! అంది సేత ఒదిలీబావ్...మమ్మల్నొదిలీసి, నీ మామూళ్ల నువొట్టికెలిపో "అని చెప్పి, మొగుడితో" "అతగాని మామూళ్లిచ్చీ గూడదేటి" అని కేకేసింది.

"సొండి సంజి కూతగా! పిండొడానికి పెల్లనిదానివి కొండల్ల యాపారం జేస్సి...ఘూవుతా, పుట్టలూ గడించినావు గడసాని దాన్లాగ యిరగ బలిస్సి...ఎవుడ్నె నువ్వు ఒట్టి పున్నేనికి పెంచావు? అమ్మ! ఎంత కళ్ళ కావరమే సూడు, సూడయితే: కాకిబట్టలోడి దెబ్బ కాస్కో...కాస్కోయే" అని లాఠీ యెత్తి...యింట్లోని యిప్ప సారా గూన మీద దెబ్బేసాడు. గూన పగిలిపోయింది. సారా నేలపాలయింది. యిల్లంతా విప్పమొగ్గా, అమ్మోనియా పులిసిన ఘాటు వాసన!

836

అట్నుండిటొచ్చి, లాఠీ "ఊపుతూ, ''పద పదరా పదా...మరియాదగా" అని లాఠీతో తోస్తూ సొండోడిని సైకిల్ వద్దకి తీసుకెల్లాడు.

"ఓలమ్మో! ఓర్నాయినో! యిదేటీగోరం! బావో...జవానుబావో...ఒదిలీవా!" అని యేడుస్తూ సైకిల్‌కి అడ్డమొచ్చింది కాంతమ్మ !

సైకిల్ ముందు చక్రంతో కాంతమ్మని పొడిచి తోస్సాడు. కాంతమ్మ వెనక మారుగా కూలబడింది! లాఠీతో సొండోడి రెక్కల మధ్య పొడిచి "పదేస్" అని కదలబోయాడు జవాను.

ఇంతలో 'కాకితాడ' గ్రామ రక్షక దళం వచ్చింది. దళ కమాండరు 'సుక్కు' చేతిలో" గండ్రగొడ్డలుంది. మిగతా దళ సభ్యులందరి దగ్గరా తలో ఆయుధముంది. జగన్నాధరావు జవాను సొండోడింటి ముందు సైకిలాపి, స్టేండు వేసినపుడు అక్కడి నుండిబెదిరి పారిపోయిన గిరిజన్లలో కొంత మంది దళ స్థావరానికి కబురందించారు. కోడిపుంజులు పోగొట్టుకున్న 'పగడాలు' గూడా 'దళం' వెనకాల జనంలో వున్నాడు.

"యేయ్...పోలీసోడా ! నిలబడక్కడ" సుక్కు కేకేసాడు !

కేక వినబడింది...కేక వచ్చిన దిక్కు చూసాడు జగన్నాధరావు ! గోచీ తప్ప ఒంటిమీద యేమీ లేని మామూలు గిరిజనుడే ! చూసినా పోలీసోడికి...పోలీసు కోప మొచ్చింది. "ఏరా...కొండోడా! నువ్వు వొత్తావేటి...టీసన్‌కి ?" అడిగాడు. "టేసన్‌కి కాదుగానీ...నీ తాతల్దగ్గిరికెలిపోగలవు మల్లా...అని గండ్ర గొడ్డలెత్తి దగ్గ రకు వస్తోన్నాడు సుక్కు ! జగన్నాధరావు నిలబడిపోయాడు ! సుక్కు చేతిలో ఎత్తి పట్టుకున్న గండ్ర గొడ్డలి...వెనకాలే దళం చేతిలోని ఆయుధాలు చూసేసరికి జవాను కాళ్ళూ చేతులూ రక్తమాంసాలు లేని కర్రలయిపోయినాయి. సైకిల్ పడిపోయింది. జవానూ కొయ్యబారి పడబోతుంటే...దళంలో సభ్యుడొకాయన పడకుండా కాపు గాసినిలిపాడు. అంతా గలిసి జవాన్ని 'గ్రామకమిటీ' ఆఫీసుకి తీసుకు వెల్లారు !

స్పృహదప్పిన జవానుకి శుశ్రూషలు జేసి..స్పృహలోకి తెచ్చారు.తెలివొచ్చాక, లేచి కూర్చొని చుట్టూ చూసాడు.

చుట్టూ..గోచీ గుడ్డల..గిరిజనులు !

కాకీ గుడ్డల అలికిడికి అదిరిపడే...ఆ గిరిజనులే !?

837

తన వైపే చూస్తున్న ఆ జనం..కళ్ళల్లోకి చూసే ధైర్యంలేని జవాను...తల దించుకున్నాడు.

ఎదురుగా వున్న గ్రామ కమిటీ బాధ్యుడు జవానుతో "నిన్ను మా గ్రామ రక్షక దళం అరెస్టు జేసింది. నీ మీద విచారణ జరపటానికి...ప్రజాకోర్టు యేర్పాటు చేయవలసిందిగా మా కేంద్ర స్థానానికి కబురు పెడతాము. వారు కోర్టు యేర్పాటు చేసేదాక, విచారణ పూర్తయ్యేదాక నువ్వు మా ఖైదీవి. మేము ఖైదీలను మీలాగా బాధించము. గౌరవిస్తాము. ఛైర్మన్ మావో 'పట్టుబడ్డ ఖైదీలను గౌరవించి' మన్నారు. నీకు అన్ని సౌకర్యాలు....మాకున్న మేరలోనే గ్రామకమిటీ యేర్పాటు చేస్తాది. నీకు సంకెళ్లుండవు...లాకప్పుండదు....సవాలక్ష ఆంక్షలుండవు. కానీ పారి పోడానికో, మరేదన్నా కుతంత్రానికో పూనుకున్నావో....అడివి అడివంతా నిన్ను చుట్టుముడతాది....మా దళం గొడ్డళ్ళకి నీ శరీరం బలయిపోద్ది" అని అన్నీ వివరించి హెచ్చరించాడు.

జగన్నాధరావుకి ప్రాణం పోయిందనీ, ఇదంతా మరో లోకంలో జరుగుతోందనీ అనుకున్నాడో క్షణం. మళ్లీ కళ్ళు గట్టిగ నులుముకొని, కాకీ గుడ్డలు నమ్మకానికై తడుముకొని, తన నెంబర్ గుర్తుకు తెచ్చుకొని తడుముకొని 'లేదు.... చచ్చిపోలేదు' అనే నిర్ణయానికొచ్చాడు. ఆ నిర్ణయానికి రాగానే మరోసారి గ్రామ కమిటీ బాధ్యుని వివరణ, హెచ్చరికా స్మరణలోకొచ్చాయి. "అమ్మనాయిన! గొడ్డలి ఎత్తీ ఎత్తగానే.... సచ్చాను, అయిపోయింది.... నావని! అనుకున్నాను. సొండోడు మాటల్లో పెట్టేసి యెంత దెబ్బ తీస్నాడు అనుకున్నాను... రక్షించారు.... చంపీలేదు" అని మనసులో అనుకొని చేతులెత్తి దేవుడికో, ఎదురుగున్న గ్రామకమిటీ బాధ్యుడుకో అసంకల్పితంగా దండం బెట్టసాగాడు.

* * *

రెండు రోజులు గ్రామ కమిటీ నిర్బంధంలో వున్న జగన్నాధరావును, మూడో రోజు కేంద్ర స్థానం వారు యేర్పాటు చేసిన 'ప్రజాకోర్టు'కు తీసుకు వెళ్ళింది గ్రామ కమిటీ!

ఈ రెండు రోజులూ ఓ కొత్త లోకాన్ని చూసాడు జగన్నాధరావు. గిరిజన్ల లోని ఐకమత్యమూ, సంఘం నేర్పిన క్రమశిక్షణా వారి అడుగడుగునా కన్పిస్తోంది. రాత్రి పాఠశాలలో అక్షరాభ్యాసమే గాకుండా, రాజకీయాలు గూడా పట్టుదలగా నేర్పు

838

కుంటున్న గిరిజనులు! బాలురలో గూడా గొప్ప మార్పు కనబడుతోంది. 'ఏమీ తెలీ నోళ్లు, గొడ్డో అంటే బెడ్డందుకొనేరకం మనుషులు యేమి మారిపోయారు! యెంత క్రమశిక్షణతో, యెంత మంచిగా ఆలోచిస్తోన్నరు! పోలీసు వాడి మీద ఎంత కక్ష, కావేశం వున్నా....యీ రెండు రోజుల నిర్బంధంలో యేమాత్రం అగౌరవ పరచని యీ గిరిజన్లకీ....నిర్బంధంలో చట్టాల్ని అతిక్రమించి దారుణంగా హింసించే పోలీసు జాతికీ ఎంత భేదం! ఏమి చిత్రం!'' యిలా విస్మయం చెందాడు జవాను.

* * *

రాళ్ళూ, రప్పలూ దాటి.... ముళ్ళ బాటల్లోంచి; కొండలెక్కి, దిగి ... తిన్నగా 'ప్రజా కోర్టు' స్థలానికి వచ్చాక జగన్నాధరావు కళ్ళకి కట్టిన గంతలు విప్పారు. రెండు చేతులతోటి కళ్ళు నులిమి చుట్టూ చూసాడు జగన్నాధరావు.

విశాలమయిన మెరకభూమి ప్రజాకోర్టు. చుట్టూ దట్టమైన తుప్పాడొంకలు.... డొంకల్లో ఆయుధాలతో మాటుగాసిన గెరిల్లాలు!

చుట్టు ప్రక్కల గ్రామాల్లో ప్రచారం చేయటంతో దాదాపు నాలుగైదు వందల మందిదాక ఆడా, మగా చేరారు. ప్రజా కోర్టుకి! ప్రజలే న్యాయవాదులు, న్యాయ మూర్తులు! ప్రజాభిప్రాయమే న్యాయశాస్త్రం!

అందరూ కూర్చున్నాక, ముగ్గురితో కూడిన ఒక సాంస్కృతిక బృందం "ఓ అరుణ పతాకమా! చేకొను మా రెడ్ శాల్యూట్!" పాట ఉత్తేజంగా పాడారు. పాట పూర్తయ్యాక "భారత రైతాంగ సాయుధ పోరాటం వర్థిల్లాలి" "విప్లవం వర్థి ల్లాలి" "అమర వీరులకు జోహార్" నినాదాలు ....ఆ కొండల్లో మార్మోగాయి. బృందం.... వేదిక నుండి.... జనంలోకి వచ్చి కూర్చొన్నారు.

ప్రజల నుండే, ఒక కామ్రేడ్ లేచి "ఈ రోజు కాకితాడ గ్రామ కమిటీ అరెస్టు చేసిన దోపిడీ పాలకవర్గ పోలీసు జగన్నాధరావుపై విచారణ జరుపుటకు యీ ప్రజా కోర్టు యేర్పాటు చేయటం జరిగింది. యీ ప్రజా కోర్టును నిర్వ హించ వలసిందిగా ప్రియతమ కామ్రేడ్ సత్యం మేస్టారుని కోరుతూ" వేదిక మీదకు ఆహ్వానించాడు.

గిరిజన రైతాంగ ప్రియతమ నాయకుడూ, ఏజన్సీ కమిటీ కార్యదర్శి వెంప టాపు సత్యనారాయణే..సత్యం మేస్టారు అంటే,

ఉపాధ్యాయ సంఘం ద్వారా కమ్యూనిస్టు భావప్రభావితులై పార్టీతో పరిచయ మేర్పడిన వెంపటాపు సత్యన్నారాయణ..వృత్తిరీత్యా టీచరుగా ఏజన్సీకి వచ్చారు !

ఏజన్సీలో గిరిజనుల జీవితాన్ని, వారిపై జరుగుతున్న దోపిడీ..దౌర్జన్యాలను చూసి చలించిపోయారాయన. గిరిజనులలో కమ్యూనిస్టు సిద్ధాంతాలను, ప్రభోదిస్తూ, ప్రచారం గావిస్తూ..సంఘాలు నిర్మించారు.. కొండ..కొండా కదిలించారు. దోపిడీపై యుద్ధాన్ని ప్రకటించారు. వృత్తి, వ్యావృత్తి అంతా ఉద్యమమే..విప్లవమే ఊపిరిగా జీవించే సత్యన్నారాయణ..మహాశక్తిగా రూపుదిద్దారు. గిరిజనుల గుండె..గుండే నిండి పోయారు..వారి ప్రియతమ నాయకులయ్యారు. కన్నబిడ్డలా కొండలన్నీ మేస్టార్ని కాపాడుతూ వస్తున్నయి !

గిరిజనులంతా ఆయన్ని "గురువు" అని పిలుస్తారు. పెద్దలూ, తోటి సహచర మిత్రులూ అప్యాయంగా "కా॥ వెంపటాపు" అంటారు. కొందరు "సత్యం మేస్టారని" పిలుస్తారు.

మేస్టారు, గురువు, వెంపటాపు..యిలా రకరకాలుగా, అప్యాయంగా, ఆద రంగా, ప్రేమగా, గౌరవంగా పిలువబడే మేస్టారు లేచారు,

జనం చప్పట్లు మ్రోగించి ఆమోదం తెల్పారు. సత్యం మేస్టారు వేదిక నలంకరించారు. కోర్టు నిశ్శబ్దమైంది. జగన్నాధరావు వేదిక ప్రక్క నిల్చున్నాడు.

సత్యం మాస్టారు లేచి నిల్చొని" ప్రియతమ ప్రజలారా ! కామ్రేడ్స్ !! ఈనాడు మనం మహత్తర కర్తవ్య నిర్వహణా బాధ్యతలో వున్నాము. అదేమంటే, దేశం యావత్తునీ పట్టి పీడిస్తొన్న నలుగురు రాక్షసులయిన..సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం, అమెరికన్ సామ్రాజ్యవాదం, దళార్లీ బూర్జువావర్గం, నిరంకుశ భూస్వామ్య వర్గాలతో యుద్ధం చేస్తున్నాము. మన ప్రియతమ నాయకుడు, కామ్రేడ్ చారు మజుందార్ బాటలో సాయుధులయిన మనం యీ దేశాన్ని మార్చాలి ! ఈ దేశంలోని కన్నీళ్లను తుడవాలి ! కష్టాలను కడగాలి ! అక్రమాలనూ, అన్యాయాలను అంతం చేయాలి ! ప్రజలకు నూతన రాజ్యం..దోపిడీ, పీడనలేని శ్రమజీవుల రాజ్యం నెలకొల్పాలి !

ఈ కర్తవ్య నిర్వహణలో, మనపార్టీ నాయకత్వములో అనేక కష్ట నష్టాలకూ, త్యాగాలకూ వెనుదీయని ఎందరో కామ్రేడ్స్..తమ రక్తంతో మన జెండాను మరింత

840

ఎరుపెక్కించారు. ! ఈ ఎర్రజెండా..యీ దేశాన్ని కదిలించింది..ఇక్కడి కొండ కొండనీ కదిలించింది !

ఇలాంటి సమయంలో, ప్రజలకు ద్రోహం చేసేవాళ్ళను, ప్రజల మీద అక్రమాలు జరిపే వాళ్ళనూ..చరిత్ర క్షమిస్తుందా ? ప్రజలకు శత్రువుగా నిలబడటం ఎంతనేరమో ఆలోచించండి.

అయితే, తెలిసో తెలియకో తప్పులు చేసే వాళ్ళను, ద్రోహులను మనం మనరీతిలో, ప్రజాకోర్టుల్లో విచారించి, శిక్షించాలి ! యిందులో భాగంగానే మన లక్ష్యాన్ని వివరించాలి ! అంచేతనే, యింత వివరంగా మీకు చెప్తూ. జగన్నాధరావు మీద విచారణ ప్రారంభిస్తున్నాను. ఇప్పుడు కాకితాడ గ్రామ కమిటీ వార్ని: పోలీసు మీద తాము సమర్పించిన ఆరోపణ పత్రాన్ని కోర్టు ముందు చదివి వినిపించ మని కోర్తున్నాను" అని సుదీర్ఘంగా తమలక్ష్యాన్నీ, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల్నీ వివరించి, కోర్టు నిర్వహణ ప్రారంభిస్తూ.. కూర్చున్నారు.

జగన్నాధరావు జవాను జీవితంలో ఎరుగని, ఆలోచించని, ఊహించని కోర్టు నిర్వహణ తీరు చూసి..ఎంతో సంచలించి పోయాడు.

గురువు ఆర్డరు దాక మాత్రమే కాకితాడ వాళ్ళు తనను ఉంచారనీ కేంద్రంకి తీసుకొచ్చాక, అందరిముందూ అన్ని గ్రామాల ప్రజల ముందూ...తన తలనరికేసి, ఆ తలని చెట్టుకట్టి, దాని మీద హెచ్చరిక వ్రాసిన చీటీ వుంచుతాదనీ అనుకున్నాడు ! యేమంటే, యిలాంటి కథలే తను విన్నాడు....ఆవిన్న కథలవల్ల....తన కథ గూడా అలాగే ముగుస్తుందనే అనుకున్నాడు ! గానీ మేస్టారి ఉపన్యాసంలో వివరించిన లక్ష్యమూ; అందుకోసం వారూ....వారి నాయకత్వంలోని ప్రజలూ అనుసరిస్తున్న బాట, వారి త్యాగశీలతా....జవానులోని అంతరాత్మని కాకీ కరకు పొరలను చీల్చి బయటకు లాగాయి !

'కాకితాడ' గ్రామ కమిటీ పోలీసులపై "ఆరోపణ పత్రం" చదివారు. పగ దాలు దగ్గర గుంజుకున్న కోడి పుంజుల గూర్చి సొందోడి మీద చేసిన దౌర్జన్యం గూర్చి మాత్రమే గాక గతంలో జగన్నాధరావు, వారి స్టేషన్ పోలీసులూ చేసిన అక్రమాలనేకం అందులో ఆరోపింపబడ్డాయి.

841

జగన్నాధరావుకి ఆరోపణ పత్రంలో అంశాలు కంటె యింకా నేరస్తంగా

తనూ, తన ఉద్యోగం కన్పించసాగింది. నేరభావంతో తల దించుకున్నాడు !

నేరారోపణ జరిగాక; సత్యం మేష్టారు లేచి జవానుని ప్రశ్నలు వేయసాగారు.

"నీ పేరు ?"

"జగన్నాధరావు...."

"యే స్టేషన్ జవానుని ?"

"ఎల్విన్ పేట...."

"యెందుకొచ్చావు కాకితాడ ?"

"..................."

"నీకు పిల్లలున్నారా ?"

"యిద్దరు కొడుకులూ....యిద్దరు కూతుళ్లున్నారు...."

భూమి పుట్రో యేమేనా వుందా ? నీ మీద వచ్చిన అరోపణలు విన్నావు కదా ! నువ్వు చెప్పదలచుకొన్నది. యేమన్నా వుంటే....చెప్పుకోవచ్చు...."

గొంతులో అనేకానేక భావోద్యోగాలు....మనసులో సంఘర్షణ ! ఏమి చెప్పాలో....యెలా చెప్పాలో, తనలోని అంతస్సంఘర్షణని ఎలా విన్పించాలో అర్థంకాని జగన్నాధరావు....కూడ గట్టుకున్న స్తైర్యంతో, గొంతు సవరించుకొని.... సభకు నమస్కారమని చేతులెత్తి మొక్కుతూ...." మాకు భూమీ పుట్రా యేమీలేదు. మా పుట్టినూరు చెక్కలి తాలూకా "నందిగాం" అక్కడ మా తల్లీ దండ్రులు కూలీనాలీ జేసి....నన్నుచదివించారు. నాతోడబుట్టిన వారు యిద్దరన్నదమ్ములూ.... పాలేరికం చేసుకు బతుకుతున్నారు. ఒకచెల్లెలు మా మేనత్త కొడుక్కిచ్చి పెళ్ళి చేసాము. తల్లీ, దండ్రే శ్రమతోటి చదుకున్న నాకు మా మావ పోలీస్ డిపార్ట్ మెంట్ లో పన్జేసేవాడు....ఆయన పుణ్యాన యీ ఉద్యోగం వచ్చింది........"

"ఈ సోదంతా ఎందుకు....నేరారోపణ మీద సెప్పవయ్యా...." జనంలోంచి విసుగ్గా ఎవరో కేకలేశారు. "ఎక్కడలేని సంగనాచి గుణమూ యిప్పు దొచ్చింది రీడికి ....యింకెవరో విసుర్లు....! యిలా గుస, గుస, రణగొణ ధ్వనులు రాసాగాయి.

వెంటనే, సత్యం మేష్టారు లేచి "నిశ్శబ్దం" అని. కేకేస్తూ "ప్రియమైన కామ్రేడ్స్ ! అసహనం పనికిరాదు. అది కమ్యూనిస్టుల లక్షణం కాదు. పోలీసుకి

842

తగిన స్వేచ్ఛ యివ్వాలి. తన పైన ఆరోపణల మీద ఆయన చెప్పదలచుకున్నదీ, చెప్పేదీ అంతామనం వినాలి. దాన్ని పరిశీలించాలి. నిజా నిజాలు గ్రహించాలి. పక్ష పాతంగా ఏ మాత్రం వుంట గూడదు. యిది ప్రజాకోర్టు, బూర్జువా కోర్టులకి....మన కోర్టులకి... తేడా అన్ని విషయాలలోనా కనబడాలి....దయచేసి శాంతం వినండి" అని మరో సారి విజ్ఞప్తి చేసి కూర్చున్నారు.

ఎక్కడి గుస గుస అక్కడే సద్దు మణిగింది. అంతా జవానునే చూస్తూ.... కూర్చున్నారు.

జవాను ప్రారంభించాడు. "...నాకు ఉద్యోగం ఇప్పించటంతో పాటు, మా మామ తన కూతుర్ని ఇచ్చి పెళ్ళి చేసాడు. ఉద్యోగం మొదటి రోజుల్లో నా కుటుం బాన్ని, నా తల్లి దండ్రుల్ని పోషించుకొచ్చే వాడిని రాను రాను ..యింట్లో బాధలు పెరిగాయి. పిల్లలు పుట్టారు. మా ఆవిడ మనసులో మా తల్లీ దండ్రిమీద ద్వేషం పుట్టింది. నా మనసులో.. పోలీసు జాతిగుణం పుట్టింది. అందరిలాగే మారిపోన్ను. అందినకాడికి కొట్టుకొచ్చి వోణి. అందల నాకు మిగిలిందేటిలేదు. మీకు తెలన్దేటి ! మా జీత మేపాటిది ? పిల్లలూ,. అదీ గాక, మా మీద అఫీసర్ల అర్డర్లెలాటివో మీరెరు గుదురు. మొత్తమ్మీద ఎవరి ప్రోద్బలమో, ప్రోత్సాహమో అని చెప్పటం కోసం కాదు యిదంతా నేను చెప్తున్నది..నేనెలాగ నేరాలు చేయటం జరిగిందో చెప్పాలనే యిది చెప్పాను. .ఏమయినా, నేను చేయరాని తప్పులే చేసాను. ఆరోపణ పత్రంలో వున్న నా నేరాలు వాస్తవమే. అందులో యేమీ అబద్ధంలేదు.

నాకు యింతదాక మాటలాడే అవకాశం వుంటాదని అనుకోలేదు. ఆ అవ కాశం యివ్వకుండానే.. శిక్ష వేస్తారనుకున్నాను.. కానీ మీరంతా గొప్పగా ఆలోచిస్తు న్నారు. గొప్ప న్యాయమైన రీతిలో నడుస్తోన్నారు.

..అందుచేతనే, మీ ముందు, ప్రజల మీద గొప్ప ప్రేమ గల మీ ముందు.. యీ మాటలు చెప్తోన్నాను. నాకు మీరే శిక్ష వేసినా..మీ యిష్టం..కానీ నా కుటుంబాన్ని ముసలి తల్లి దండ్రుల్ని అనాథలు జేయొద్దని..కోరుతున్నాను." ఒళ్ళంతా చెమటలు ధారాపాతంగా కారుతోంచే మనసులోని భావోద్దేశం యింత సేపు మాట్లాడించింది జగన్నాధరావుని !

మేష్టారు లేచి, జనం పైపు చూసి "కామ్రేడ్స్ ! ఆరోపణ పత్రంలోనే

గాక, అదనంగా యింకేమన్నా వున్నా,,జగన్నాధరావు సంజాయిష్ మీదా ఏమి మాట్లాడాలనుకున్నా..ఒక్కొక్కరూ వచ్చి మాట్లాడండి" అని ఆహ్వానించారు.

జనంలోన గొంతుకూర్చొని వున్న, సన్నగా పొడుగ్గా వున్న రసూల్ లేచి వచ్చి "కామ్రేడ్లారా.. పోలీసోడిని నమ్మకూడదు. ఈలకి దయా, దాక్షిణ్యాలుండవు. ఒకపాలి.... కట్రెల కావిడి అమ్ముకొందుమని, ఎల్విన్ పేటెల్లాను.... సరిగ్గా, ఈల టేసన్ కాడికిరానిచ్చి, నా కట్రెల కావిడి నాక్కుంట్రు పోలీసోల్లు! "ఓలమ్మ! యిదేటి బావ్....యీ గోరం! బియ్యం గింజలు నేవని, కట్రలమ్మడాం కొచ్చాను. కావిడి నాక్కొని.... నా కడుపు కాల్సికండి" అనెంత బతిమాల్నానో! ఒక్కడు కనికరించనేదు....మనిసొక మాటాడి, లాఠీల్తోటి బీపిరేగ్గొట్టిసినారు !.... అంచేత పోలీసోడ్నిదిలీ గూడదని చెప్పదల్చుకున్నా"నని చెప్పి జనంలో కలిసాడు!

ఆడవాళ్ళ మధ్యలోంచి, నడి వయసున్న "కొమలమ్మ" లేచి అక్కడే నిల బడి మాట్లాడబోయింది.

జనం వేదిక ముందుకి వెళ్ళమని కేకేసారు.

కొమలమ్మ సిగ్గుతో, నవ్వేస్తూ.... "యిక్కడై తేనే సెప్తాను.... లేపోతే కూకుండి పోతాన"ంది.

మేస్టారు "సరే.... అక్కడ్నించే చెప్పు.... కామ్రేడ్" అన్నారు. "ఈ పోలీసు జాతి దుంపనాశినం అయిపోవాల! ఈ గండలేకదా ... అప్పుడు మందకి మందెలి పోవొచ్చి మన వొలసలు బుగ్గి జేస్సారు, మా ఆడకూతుళ్ళ మానపేనాలు తీస్సారు.... అది గేపకమొత్తే, నా సెల్లెలు గేపకమొత్తే.... నా కళ్ళంట రత్తం పడ తంది..." అని మరి మాటల్రాక, యేడుస్తూ కూర్చుండి పోయింది.

కొమలమ్మ చెల్లెలు.... రాజమ్మకి 'పెద్ద ఖర్జ' గ్రామం అరిక సామలుతో పెళ్ళయింది. ఆ రోజు వారిద్దరికీ శోభనం! సరిగ్గా ఆ రోజున.... 'పెద్ద ఖర్జ' మీద పోలీసులు దాడిచేసి సర్వనాశనం చేసారు. ఆ దుర్ఘటనలో 'రాజమ్మ'.... మాన ప్రాణాలు కోల్పోయింది.

ప్రజాకోర్టు ఒక్కసారి ఆవేశమయమైంది.

కోర్టులో మల్లీ కలకలం చెలరేగింది. మనిషోమాట! తలా ఓ ఘటన! చెప్పుకోసాగరు. ఎవరో "జోహార్ అమరవీరులకు!" అంటే కోర్టంతా

844

"జోహార్ల"ర్పించింది. రైతాంగ పోరాటాలపై పోలీసుల దమనకాండ.... "నశించాలి" కొండ కొండా ప్రతిధ్వనించింది !

ఈ వాతావరణంలో కాకితాడ గ్రామరక్షక దళం లేదకొండరు, సుక్కు లేచి వేదిక ముందుకొచ్చి "యీనాడు యీ వొలసల్ల మద సంగబలం యింతగా వున్నా.... యీ పోలీసోడు వొచ్చాడు. మామూళ్ళ కోసమొచ్చాడో... మరే అంతకం చెయ్య డాంకొచ్చాడో.... యెందుకొచ్చాడన్నది చిన్న యిసయం కాదు. యిప్పుడు మించి పోయింది పరిస్థితి అని గుడ్లు తేలేస్సి, నానే పాపమెరగనంతండు గుడ్డి కొంగలాగ ! లాభం నేదు. ఈడ్ని.... యీడి పాపాలకి శిచ్చగా.... యీ కోర్టు ముందు చంపాల!" అని ప్రకటించి.... జనం వైపు చూస్తూవచ్చి జనంలో కూర్చున్నాడు !

జనంలో "అవును....అవును....చంపాల" కేకలు !

జగన్నాథరావు జవానుకి సుక్కు ప్రకటనతో, జనం కేకలతో పై ప్రాణాలు పైనే పోయాయి. అదివినీ కొండనీ చూసాడు. ఆకాశాన్నీ... భూమినీ తల్చాడు. ఏడుకొండలవాడినీ.... ఎవరెవర్నో తలపు కొచ్చిన దేవుడ్నీ, దేవతనీ తలచాడు. న్యాయమూర్తి వైపు దీనంగా చూస్తూ... తడారిపోయిన గొంతుతో కోర్టులో కూర్చున్న ప్రజలందరికీ చేతులెత్తి మొక్కుతూ... "లేదు....నాయనలారా ! లేదు..నా దురుమార్గాన్నీ, నా జాతి దురుమార్గాన్నీ క్షమించగూడదు. నిజమే....కాదన్ను.... అంతటి పాపాలే చేసాము. కానీ మీరు ఉన్నతమైన ఆలోచన గలవారు. నా పరిస్థితీ, నా కుటుంబ పరిస్థితీ ఆలోచించమంటన్నాను. మీరంతా నా తల్లీ దండ్రీ లాంటోళ్ళ ! నా తల్లీ దండ్రీ తమ బతుక్కు యెంత బదపజేసారో; యెన్ని బాధలు పడ్డారో నేనెరుగుదును. యిప్పుడికీ.... ఆ బాధలు పోలేదు. మాతోటే వున్నాయి. మీరు బాధలు పోడానికి యుద్ధం చేత్తంద్రు ! మీ యుద్ధం నాకూ, నా తల్లిదండ్రులకూ లాభమే గానీ నష్టం కాదు ! యికబట్టి... యీ నేలతల్లి యీ అడివితల్లి సాక్షిగా చెప్తున్నాను. నేనెలాటి దురుమార్గప్పనీ చెయ్యను.... చెయ్యను గాక చెయ్యను. మని సిగా యికబట్టి బతుకుతాను....నన్ను బతికించండి.... నా పిల్లా జెల్లా....కుటమాంవి అనా థలు జేసీకండి" అని యేడుస్తూ మొత్తుకోసాగాడు.

జగన్నాథరావు సంజాయిషీ, క్షమాపణ, ఆవేదన కోర్టులో చర్చ నీయాంశ మైంది. కొందరంతా నాటకం 'పోలీసోడి టక్కుల్ని లెక్కచెయ్యొద్దు, యీడ్నిప్పు

డొదిలేస్తే....తన బలగం బలగాన్నెంతేసుకొచ్చి వొలసలి మీద పడతాడు....ఈడ్నొ దలగూడదు'' మరి కొంతమంది "నిజంగానే పోలీసోడు మారిపోయాడు. తనను తానే అసహ్యించుకుంటున్నాడు. ఎంతయినా మన పేద వర్గంనుండే వచ్చాడు కదా. చూద్దాం....ఈ సారికి వొదిలీడమే మంచిది'' అనీ కోర్టులో కోలాహలం.

కోర్టు వేదిక ముందుకొచ్చి యిలా వాదనలు విన్పించారు కూడా కొంతమంది. అయితే ఏదీ అచ్చితంగా తేలలేదు. అందరూ జవాన్ని 'శిక్షించాలా? ...ఒదిలీయాలా?' చర్చలో తమతమ భావాల్ని ప్రకటిస్తూ, చర్చిస్తూ ...కోలాహలంగా వున్న సమయంలో న్యాయమూర్తిగా అందరి అభిప్రాయాలూ, ముద్దాయి సంజాయిషీ విన్నాక సత్యం మేస్టారు నిల్చొని, శాంత గంభీర స్వరంతో 'కామ్రేడ్స్! జవాను సంజాయిషీ విన్నాక, మీ ఫిర్యాదులు, వక్తల అభిప్రాయాలూ విన్నాక ఒక విషయం అర్థమవుతోంది! మన ఫిర్యాదుల్లో అధిక భాగము పోలీసు వర్గాలు చేసిన దురంతాలే తప్పా ....యీ జగన్నాధరావు ఒక్కడూ చేసినవికావు. అయితే నది ఎంత స్వచ్ఛమయినదయినా....మహా సముద్రంలో కలిస్తే అది ఉప్పనయి తీరుతుంది. అలాగే జగన్నాధరావూ దురంతాలు చేసి వుంటాడు.

శాస్త్రీయంగా ఆలోచించే మనం ఎవరు యే పనిచేసినా ఆ పని ఎందుకు చేస్తున్నారో పరిశీలిస్తాం. దోపిడీ పాలక వర్గాలకు యిట్లాంటి పోలీసులు కాళ్లూ చేతులు నిరంకుశ అధికార్ల చేతిలో వీరు ఆట బంతులు! అయితే వీరు మన పేద వర్గానికి చెందిన వారన్నది గుర్తించాలి మనం.

తెలిసో, తెలియకో; బ్రతుకు తెరువు పేరిటనో యిలాంటి వారు తప్పులు చేస్తే....వాట్ని వారి దృష్టికితెచ్చి సరిదిద్దుకోమని చెప్తాము. ఆ రకంగా మంచికి మీరెందుకు అవకాశమివ్వాలి! యేమంటే....వీరూ పేదవారే గనక!

మన ఉమ్మడి శత్రువు దోపిడీ వర్గాలు! ఉమ్మడి శత్రువు మీద పోరాటం చేస్తున్న మనకు మన కష్టనష్టాలు వుంటాయి. అయితే; యీ జగన్నాధరావుని విడిచి పెట్టినంత మాత్రాన అదనంగా వచ్చే కష్ట నష్టాలేమీ వుండవు. నిరంకుశ పోలీసు శక్తుల వలయంలోనే....మనం ఉద్యమాన్ని రక్షించుకుంటున్నాము కాదా యీనాడు!

అంచేత, పేద వర్గానికి చెంది....నికృష్ట జీవనం సాగిస్తోన్న యీ జగన్నాధరావు జవానుకి ప్రాణభిక్ష పెట్టి....మంచిగా మారేఅవకాశం యిద్దాము. ప్రజల బాధల్ని

846

పోరాటాల్ని అర్థం చేసుకొనే అవకాశం యిద్దాము. మంచి మార్గానికి, ప్రజల మిత్రుడుగా మారేడా సరేసరి! లేదంటే, గత తరహా జీవితాన్నే కొనసాగిస్తే...మన గెరిల్లాల కత్తులకు, పీడిత జన ఆగ్రహాగ్ని జ్వాలలకూ బలికాక తప్పదు—ఏమంటారు"? అని సుదీర్ఘంగా వివరించి, ప్రశ్నించారు.

ప్రజా కోర్టులో మేస్టారి ఉపన్యాసం, ప్రశ్నా అందర్నీ ఆలోచింపజేసింది. "అవునవును, గురువు చెప్పిందే గురయ్యింది. పాపం పేదోడు ... పిల్లలు గలోడు" అనే సానుభూతి శబ్దాలు పెరిగాయి.

జనంలోంచి, కోర్టుని నిర్వహించవలసిందిగా మేస్టార్ని ఆహ్వానించిన కామ్రేడ్ లేచివచ్చి "ప్రియతమ ప్రజలారా! గురువు చెప్పిన అంశాలు విన్నారు కదా! ఉత్తమ లక్ష్యానికి అంకితమయిన మనం ఆ ఉన్నత భావంతోనే ఆలోచించి... యిప్పటికి జగన్నాథరావుని క్షమించి... విడిచిపెట్టడం మంచిదిగా భావిస్తున్నాను. మీకు అంగీకారమైతే, చప్పట్ల ద్వారా ఆమోదాన్ని తెల్పుకోరుతున్నాను; అంతేగాక ఎవరికైనా అభ్యంతరమున్నా, యీ వేదిక వద్దకు వచ్చి తెల్పగోర్తున్నాను" అని చెప్పారు.

జనంలోంచి ఆమోదం "చప్పట్ల" మ్రోతల్తో ధ్వనించింది. అంతా జగన్నాథ రావుని మిత్రుడిగానే, సానుభూతిగా చూడసాగారు.

జగన్నాథరావు చచ్చి బ్రతికినట్లయ్యాడు! పాత పోలీసు జీవితం అంతా చచ్చిపోయింది! యిప్పుడు జనం ముందున్న జగన్నాథరావు కొత్త వ్యక్తి! ఆ వ్యక్తిని పూర్వంలో కాకీగుడ్డలు గుండెల్నీ, గుండెలోని కరుణనీ మానవత్వాన్నీ కప్పి వేయలేవు. లాఠీ, బూటులు దర్పం చూపలేవు. నోటు బూతులు పలుకలేవు. మొత్తం జగన్నాథరావు రూపం, భావం మార్పయ్యింది! జల, జలా కన్నీటిబొట్లు రాలుస్తూ, అందరివైపూ ఆరాధనగా చూస్తూ "నన్ను క్షమించిన మీ గొప్పతనం, మీ ఉన్నత ఆదర్శం తెలుసుకున్నాను. మీరు గెలుస్తారు. ప్రజలుగెలుస్తారు. ప్రజా పోరాటం వర్ధిల్లుతుంది..."ఆవేశభరితంగా పిడికిలెత్తి పలకసాగాడు. యీ మహత్తర ఉద్యమానికి తన విధిగా జవాను తన జేబులో వున్న 'ఇరవై నాలుగు' రూపాయలూ కోర్టుకి సమర్పించుకొన్నాడు.

జనంలోంచి ఎవరో "ప్రజాకోరు .... వర్ధిల్లాలి" "సంఘం .... వర్ధిల్లాలి". "సాయుధ పోరాటం....వర్ధిల్లాలి" అరిచేరు. ప్రతిగా జనం గొంతులన్నీ నినదించాయి. వాటితో పాటుగా జగన్నాథరావు గొంతూ అసంకల్పితంగా వంతు పలికింది...బను లుగా కొండ కొండా ప్రతిధ్వనించింది!

847